కన్నబిడ్డల్ని భారంగా తలచిన ఆమెలో మార్పు?

బి.కృష్ణకుమారి కథ

# పిచ్చితల్లి

అప్పుడే తెల్లవారింది!

"దిక్కుమాలిన సంత. తెల్లారి లేచింది మొదలు వీళ్ళతో వేగలేక చస్తున్నాను. నా బ్రతుక్కి అచ్చటా ముచ్చటాలేదు. జీవితానికి విశ్రాంతి అన్నది లేదు!"

పడకమంచం మీదినుంచే మొదలుపెట్టింది సుభద్ర. ఆమె అరుపులకు సుదర్శనం ఉలిక్కిపడిలేచాడు.

"ప్రొద్దుటే ఏంటే నీ అష్టోత్తరం..." అంటూ దుప్పటి ముసుగుతన్నాడు.

"అవునవును నాది అష్టోత్తరం లానే అనిపిస్తుంది. మీకేం మగమహారాజులు. ఆఫీసుకు చెక్కేస్తారు. పొద్దస్తమానం ఇంట్లో నేను పడే బాధ మీకేం తెలుసు?"

ఇక లాభం లేదనుకుని పైకి లేచాడు సుదర్శనం.

రోజూ ఇదే తంతు. తనివితీరా నిద్రపోయే అదృష్టం లేదు. సుదర్శనానికే కాదు. చుట్టుప్రక్కల వారికి కూడా సుభద్ర అరుపులతో మెలుకువ వచ్చేస్తుంది.

అసలు సుభద్రకు కూడా తన మీద తనకే కోపం వస్తుంది. తన పరిస్థితికి ఒక్కోసారి జాలి అనిపిస్తుంది కూడా. కానీ చేతులు కాలాక ఆకులు పట్టుకుని ప్రయోజనంలేదు. అసలు చేతులుకాలడం ఏమిటి?

సుభద్రకు ఎనిమిదిమంది పిల్లలు. అయిదుగురు ఆడపిల్లలు, ముగ్గురు మగపిల్లలు.

ఆపరేషన్ గురించి ఎంతపోరినా సుదర్శనం వినిపించుకోలేదు. సుభద్ర చేయించుకుంటానన్నా ససేమిరా ఒప్పుకోలేదు. ఎనిమిదోసారి ఆడపిల్ల పుట్టినప్పుడు సుభద్ర



ఆరోగ్యం బాగా దెబ్బతింది. డాక్టరు–భార్యాభర్తలిద్దర్నీ చివాట్లు పెట్టి ఆపరేషన్ చేసింది. అక్కడితో పిల్లలకి ఫుల్‌స్టాప్ పడింది! ఈ మధ్యకాలంలో సుభద్రకు విసుగు, కోపం ఎక్కువైపోయాయి. పిల్లలంటేనే ఆమెకు ఏవగింపు కలుగుతోంది.

సుదర్శనం సంపాదనా... ఏదో అంతంత మాత్రం. దాంతో ఆర్థికంగా ఇబ్బందులు

... అస్తమానం పిల్లలకి ఏదో సుస్తీలు. వాళ్ళకి సపర్యలు చేయలేక నానా యాతనా పడుతోంది.

ఆమెకు ఎవర్ని తలుచుకున్నా ఉక్రోషం ముంచుకొస్తుంది. ఆమె ఇద్దరన్నయ్యలకు, ముగ్గురు అక్కలకు లెంగూరిటుకూమంటూ ఒకరూ ఇద్దరూ సంతానం.

ఆమె తమ్ముడికైతే అసలు పిల్లలు లేరు. దాంతో అతను సుభద్ర కూతురును పెంచుకోవాలని అనుకున్నాడు.

ఆ మాటే సుభద్రతో అన్నాడు కూడా. కానీ అతని భార్య ఒప్పుకోలేదు.

''మనం పెంచుకోవాలంటే మీ అక్క కూతురే దొరికిందా? లోకంలో బోల్డంత మంది అందమైన, ఆరోగ్యకరమైన పిల్లలు వుంటారు. ఊర్కే ఉబలాటపడకండి...!'' అంటూ చివాట్లు పెట్టింది.

''అదికాదు సుందరీ అందం ఆరోగ్యం — ఆ విషయాలది ఏముంది మనవద్దకు వచ్చాక మంచిపోషణ చేస్తే అదే వస్తుంది. నా మాట విను... పాపం అక్క కూడా పిల్లలతో సతమతమవుతోంది. ఆర్థికంగానూ ఇబ్బందుల్లో వుంది...!'' నచ్చచెప్పాలని చూసాడు.

''మీరు ఎన్నయినా చెప్పండి. అయినా అంతమంది పిల్లల్ని కనడం ఎందుకు? అది వాళ్ళ ఖర్మ!'' అంటూ ఈసడించింది. దాంతో సుభద్ర మనస్సు చివుక్కుమనిపించింది.

''తను నిర్ణయం తెలియజేయకముందే అన్ని మాటలుపడింది. నిజంగా అది ఖర్మా?'' అప్పటినుండి ఆమె మనసు మరో మార్గంలో పయనించటం మొదలుపెట్టింది.

''అవును... తన పిల్లలలో ఎవర్నైనా పెంపకానికి ఇస్తే? వాళ్ళయినా సుఖపడ్తారు. తనకూ కొంచెం రిలీఫ్. తినీ తినకా ఎందుకీ చాలీచాలని జీవితం. వాళ్ళూ అనుభవించటం? ఇంత మంది పిల్లల్ని పెంచి పెద్దచెయ్యడం అంటే మాటలా? అందులో అయిదుగురు ఆడపిల్లలాయె. వాళ్ళ పెళ్ళి చేయడం మాటలా?'' అప్పుడే ఓ నిర్ణయానికి వచ్చింది.

పెద్ద బావగారికి ఇద్దరూ మగపిల్లలే. ఆడపిల్లలు లేరు. ఆయన వచ్చినప్పుడు సకల మర్యాదలూచేసి మెల్లగా విషయం బయట పెట్టింది.

''అమ్మో ఆడపిల్లను పెంచుకోవటమా? మీ అక్క ఆ ఇద్దరి బడుద్దాయిలతోనే వేగలేకపోతోంది. నిజంగా పిల్లల పెంపకం నీవద్ద చూసి నేర్చుకోవలసిందే నమ్మా. ఇంతమంది పిల్లల్ని ఎలా సాకుతున్నావో అని ఆశ్చర్యంగా వుంది!'' అది ప్రశంసో, హేళనో అర్థంగాక మిన్నకుండిపోయింది. అయినా వాళ్ళందరి వద్దా, తెలిసిన వాళ్ళందరి వద్దా మూచాయగా విషయాన్ని కదిపేది.

తన అదృష్టం పిల్లల అదృష్టం బాగుండి ఒక్కరు తగ్గినా తగ్గినట్లే కదా అని ఆమె ఆశ.

ఆ ఆశ తీరక, ఏంచెయ్యాలో పాలుపోక తన అక్కసంతా భర్తమీద చూపిస్తుండేది.

భర్త తరపు వాళ్ళూ ఎవరూ తమ పిల్లల్ని

అడక్కపోగా అనాధ ఆశ్రమాల నుండి పిల్లలను తెచ్చుకున్నారు. దాంతో ఆమె అగ్గిమీద గుగ్గిలం అయిపోయింది. ఎలాగైనా సరే పిల్లలు చక్కగా పెరగాలి. పెద్ద చదువులు చదువుకోవాలి. ఉన్నత స్థానానికి ఎదగాలి. కానీ ఇక్కడుంటే అవేం సాధ్యపడవు.

***


అదిగో అలాంటి సమయంలో ఎదురింట్లో ఒక జంటదిగారు. స్నేహలత జగదీశ్ బాబు.

జగదీశ్‌బాబుకి బాంక్‌లో ఉద్యోగం. భర్త ఉద్యోగానికి వెళ్ళగానే స్నేహలత సుభద్ర వద్దకు వచ్చేది. ఆరునెలల్లోనే వారిద్దరి మధ్య మంచి సన్నిహిత్వం ఏర్పడింది. ఒకరోజు మెల్లగా విషయాన్ని కదిపింది స్నేహలత.

"సుభద్ర నాకు పిల్లలు లేరని నీకు తెలుసుగా?"

"ఆ విషయంలో మాత్రం చాలా అదృష్టవంతురాలివి లతా... నన్ను చూస్తున్నావుగా...!" బాధగా అంది సుభద్ర.

"ఆ విషయమే సుభద్ర... నీకు ఇష్టమైతే నీ పిల్లల్ని పెంచుకోవాలని వుంది. వాళ్ళకి ఏలోటూ రానీయను. నువ్వు ఎప్పుడు కావాలంటే అప్పుడు వాళ్ళని చూడవచ్చు. నీకు అభ్యంతరం వుండదని చూచాయగా తెలిసింది. నువ్వు ఒప్పుకుంటే మావారు వచ్చి అన్నయ్యగారితో మాట్లాడతారు. ఈ వూరినుండి వారికి ట్రాన్స్‌ఫర్ అయిపోయింది. రేపు వారంలో వెళ్ళిపోతాము. ఇంకో విషయం చెప్పనా... పెంపకానికి తీసుకునేది ఒక్కరిని కాదు ముగ్గురిని. ముగ్గురునూ మేమే పెంచుకుంటాం. నీకు తెలియదు సుభద్ర పిల్లల కోసం నేనెంత తపి ంచానో. ఆయన ఆఫీసుకు వెళ్ళిపోయిన తరువాత నా ఒంటరి జీవితం ఎంత దుర్భరంగా వుంటుందో తెలుసా? పిల్లలతో ఇల్లంతా సందడి సందడిగా వుండాలి. మాకా తరగని ఆస్తి



## రోబోట్ షో

ఇది మరమనుషుల యుగం! రోబోట్‌లు ఈనాడు చెయ్యలేని పనికూడా లేదు. స్కాట్లండ్‌లోని ట్యూరింగ్ ఇన్‌స్టిట్యూట్ క్రితము తెలివితేటలున్న మరమనుషుల్ని కూడా తయారు చేసింది! అంతేకాదు! ఆ సంస్థ ఆధ్వర్యంలో కిందటి మే నెలలో ఓ మరమనుషుల తెలివితేటల ప్రదర్శన కూడా జరిగింది. ప్రపంచంలోని ఎన్నో సంస్థలు తమ తెలివైన రోబోట్‌లను ఆ సందర్భంగా ప్రదర్శించాయి!

అందర్నీ ఆకర్షించిన ఇలాంటి "రోబోట్ షో"లు మరెన్నో ముందు ముందు జరగబోతున్నాయి!

—ఆర్బీయమ్

వుంది. అంతేకాదు. నీ ఆర్థిక ఇబ్బందులు తీరడానికి నేను సాయం చేస్తాను. ఇలా అంటున్నానని వేరుగా అనుకోవద్దు. నువ్వు! నా స్నేహితురాలివి!'' అంటూ ముగించింది

సుభద్రకు ఆనందంతో నోటమాట రావడంలేదు. ఏం వింది తను? నిజంగా తన చెవులు సరిగ్గా పనిచేస్తున్నాయా? తన పిల్లలు ఇంత అదృష్టవంతులా? ఒకరు కాదు ముగ్గురు. బాప్‌రే... తన కలలు నిజమయ్యాయి. వాళ్ళు సుఖపడతారు. ఎన్నాళ్ళగానో తనలో మిగిలిపోయిన కోరిక!

''ఏం సుభద్ర మాట్లాడవు?'' లత మాటలతో ఈ లోకంలోకివచ్చింది. ''మా వారిని కూడా ఓ మాట అడిగి చెబుతాను లతా...!'' అంది.

''అలాగే. కానీ నేను తీసుకునే ముగ్గురిలో ఇద్దరు ఆడపిల్లలను ఒక బాబును ఇవ్వు. నీకూ కొంతభారం తగ్గుతుంది...!''

సుభద్ర సంతోషం అంతా ఇంతా కాదు. భర్త ఎప్పుడు వస్తాడా ఈ విషయం అతని చెవిన ఎప్పుడు వేద్దామా! అని ఆత్రంగా వుంది. అన్ని పనులూ గబగబా చేసేసింది.

పిల్లలందర్నీ చక్కగా అలంకరించింది. అంత ప్రత్యేకంగా ఎప్పుడూ పిల్లల్ని అలంకరించదు. అందుకు ఓపికా, తీరికా ఎప్పుడూ వుండవు. పెద్ద పిల్లలు స్కూలుకి వెళ్ళిపోయారు. అప్పుడప్పుడే ఊహ తెలుస్తున్న పిల్లలకి అర్థం కావటంలేదు. అమ్మంటే వారికి తగని భయం. ఎప్పుడూ తిడుతూ, కొడుతూ వుంటుంది. విసుక్కుంటూ అన్నం పెడుతుంది. అమ్మదగ్గర చేరకుండా వాళ్ళలో వాళ్ళు ఆడుకుంటారు.

అలాంటి అమ్మ ఈరోజు ఆనందంతో ఇల్లంతా కలియతిరుగుతుంటే వాళ్ళకి సంబరంగా వుంది. కానీ సుభద్ర ఆనందం ఎంతోసేపు నిలువలేదు. పిల్లలందర్నీ కూర్చోబెట్టి అన్నం పెట్టింది. చప్పున దుఖం ముంచుకువచ్చింది.

''రేపటినుండి ఈ ఆనందం తనకు వుండదు కదా? అసలు ఇది ఆనందమా? ఇది ఆనందమని ఇన్నాళ్ళు ఎందుకనిపించలేదు? రేపటినుండి ముగ్గురు పిల్లలు తక్కువ అయిపోతారు. ఆమె మనసంతా అదోలా అయిపోయింది. ఆప్యాయంగా అందర్ని దగ్గరకు తీసుకుంది. ప్రేమగా ఒళ్ళంతా నిమిరింది.

ఇక వీళ్ళు తనకు పిల్లలుకారు. తను వీరికి అమ్మకాదు. గొప్పగొప్ప బతుకులు బతుకుతూ... తను కనిపిస్తే డబ్బుకు మమ్మల్ని అమ్మేసావా అన్నట్లు చూస్తే?''

ఆమెకు ఇప్పుడిప్పుడే జ్ఞానోదయం కలుగుతోంది.

''అవును... నా పిల్లల్ని నేను ఎందుకు ఇస్తాను? కడుపున పుట్టిన వాళ్ళని పోషించుకోలేని దౌర్భాగ్యురాలినా? నేనేం తల్లిని? ఒకేసారి స్నేహలత ముగ్గురు పిల్లలు కావాలని అడిగిందే. మరి ఇన్నాళ్ళూ ఎందుకింత సంకుచితంగా ఆలోచించింది? పిల్లల్ని ఎవరికి దత్తతు చేద్దామా అని ఉవ్విళ్ళూరింది? ఎనిమిదిమంది కాదు ఇంకా అంత మంది వున్నా ఒక్కరిని కూడా ఎవ్వరికీ ఇవ్వనుగాక ఇవ్వను. ఖచ్చితంగా చెప్పేస్తాను. పిల్లలు తల్లి దగ్గర కాక ఇంకెవరి వద్ద సంతోషంగా

వుంటారు? చెట్టుకు కాయబరువా? తల్లికి బిడ్డ బరువా? లత సాయం చేస్తానంది. నా బిడ్డల్ని తీసుకుని, లంచమిస్తుందా? అసలు దీనంతటికీ కారణం తానే.

అమ్మో ఆనాడు తమ్ముడు అడిగినప్పుడు మరదలు వద్దంది కాబట్టి సరిపోయింది. లేకపోతే తనకిప్పుడు ఒక బిడ్డ తగ్గిపోయేది. ఏదో కోపం వచ్చినప్పుడు కేకలేస్తాం... రెండు అంటిస్తాం. అంతమాత్రం చేత పిల్లల మీద ప్రేమ లేనట్లేనా? నాకు బుద్ధి వచ్చింది. చెట్టుకు ఎన్ని కాయలు వుంటే అంత నిండుతనం. దేవుడిచ్చిన సంతానాన్ని పారేసుకుంటామా? ఇప్పుడే లతకీ సంగతి చెప్పేస్తాను అనుకుని... వెళ్ళి చెప్పేసి వచ్చింది.

సుభద్ర కిప్పుడు ఎంతో రిలీఫ్‌గా వుంది. ఇప్పుడామెకు పిల్లలే లోకం... లోకమంతా పిల్లలే.

***

అప్పుడే తెల్లవారింది!

"దిక్కుమాలిన సంత. తెల్లారి లేచింది మొదలు వీళ్ళతో వేగలేక చస్తున్నాను. నా బ్రతుక్కో అచ్చటా ముచ్చటా లేదు. జీవితానికి విశ్రాంతి అన్నది లేదు..!" పడక మంచం మీద నుంచే మొదలుపెట్టింది సుభద్ర అష్టోత్తరం!

